జిల్లాలో 2.37లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తి

- కలెక్టర్ హనుమంతరావు

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, మే 16 : జిల్లాలో 2.37లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగలిగామని, పక్షం రోజుల్లో మరో లక్ష టన్నులకు పైగా కొనుగోలు చేస్తామని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. యాసంగి 2024-25 ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎస్ రామకృష్ణారావు, పౌరసరఫరాల కమిషనర్ దేవేందర్‌సింగ్ చౌహాన్‌తో కలిసి శుక్రవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సీజన్‌కు సంబంధించి ఇప్పటికే రూ.452 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. వర్షాల దృష్ట్యా ఇంకా ఎక్కువ ధాన్యం ఉన్న కేంద్రాలను గుర్తించి, ఆయా కేంద్రాలకు ప్రత్యేక అధికారులను నియమించి కొనుగోళ్లను త్వరగా చేపడుతున్నామని చెప్పారు. గత సంవత్సరంతో పోల్చితే ఇప్పటి వరకు ఎక్కువగానే కొనుగోళ్లు జరిగాయన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రోజారాణి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ హరికృష్ణ, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీసీఓ మురళి, డీఏఓ గోపాల్, జిల్లా మార్కెటింగ్ అధికారి సబిత, అధికారులు పాల్గొన్నారు.

పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- జయశంకర్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ బలరాం

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బలరాం

చౌటుప్పల్, మే 16 : పంటల సాగులో రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జయశంకర్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ బలరాం అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 'రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. ఎరువులను కొనుగోలు చేసిన తర్వాత రసీదులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. వీలైనంతగా పంట మార్పిడి చేసుకోవాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించే పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డి.కృష్ణ, స్పందన, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ఏఓ ముత్యాల నాగరాజు పాల్గొన్నారు.

డెంగ్యూ రహిత జిల్లాగా మార్చాలి : డీఎంహెచ్‌ఓ

ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మనోహర్

భువనగిరి అర్బన్, మే 16 : ఆరోగ్య వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేసి డెంగ్యూ రహిత జిల్లాగా మార్చాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ మనోహర్ అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డీఎంహెచ్‌ఓ ప్రారంభించి మాట్లాడారు. నివాస పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. తాగి పడేసిన కొబ్బరి బోండాలు, పగిలిపోయిన కుండలు, పాత టైర్లు, వాటర్ బాటిళ్లు, పాత కూలర్లలో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా జాతీయ కీటక జనిత నియంత్రణ అధికారి డాక్టర్ సాయి శోభ మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది డెంగ్యూ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చికిత్స కన్నా ముందు జాగ్రత్త మిన్న అని, దోమల వ్యాప్తి నివారణ మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమల ద్వారా వచ్చే డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, మెదడు వాపు, చికున్ గున్యా వంటి వ్యాధుల నివారణకు కృషి చేయాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు జ్వరం ఉన్న వారి రక్త నమూనాలు ఇంటి వద్ద తీసి ల్యాబ్‌కు పంపించి పరీక్ష చేయించి జాగ్రత్తలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా.నిరోష, డాక్టర్ అంజయ్య, సబ్ యూనిట్ ఆఫీసర్లు సముద్రాల అశోక్, బొమ్మగాని నర్సయ్య, మధు మోహన్, మల్లికార్జున్, శేషు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాఫర్, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి : తాసీల్దార్

హాజీపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తాసీల్దార్ శ్రీనివాస్‌రావు

బొమ్మలరామారం, మే 16 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తాసీల్దార్ శ్రీనివాస్ రావు నిర్వాహకులకు సూచించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో రామలింగంపల్లి, బొమ్మలరామారం, హాజీపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గంజను కొనుగోలు చేస్తామన్నారు. రైతులు పుకార్లు నమ్మి దళారులకు ధాన్యం విక్రయించవద్దని సూచించారు. వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గూదె బాలనర్సయ్య, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి : ఎంఈఓ

పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ రోజారాణి

బొమ్మలరామారం, మే 16 : బడుల పునఃప్రారంభానికి ముందుగానే పాఠశాలలో వంటశాల, టాయిలెట్, ఇంకుడు గుంత, మంచినీటి ట్యాంక్ నిర్మాణ పనులను అమ్మ ఆదర్శ కమిటీల సహకారంతో త్వరగా పూర్తి చేయాలని మండల విద్యాధికారి రోజారాణి అన్నారు. మండలంలోని యావాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ కలెక్టర్ దత్తత గ్రామం అయిన యావాపూర్‌లో విద్యార్థులు లేక మూతబడిన స్కూల్‌ను ఈ విద్యా సంవత్సరం అన్ని సౌకర్యాలతో ప్రారంభిస్తున్నామన్నారు. గ్రామస్తులు ఉపాధ్యాయులకు సహకారం అందించి తమ పిల్లలను బడికి పంపి ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవాలని కోరారు. అనంతరం నాగినేనిపల్లిలో బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, నాణ్యమైన విద్య గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సీవీ శ్రీనివాస్, సీఆర్పీలు శ్రీహరి, విశ్వరూపం పాల్గొన్నారు.

IMMANUEL BUSINESS SCHOOL
Affiliated to JNTU Hyderabad
Solipet Village, Bommalaramaram Mandal, Yadadri Bhongir (Near Keesara)
Ph. No. 040-27175308
Applications are invited for the following positions for the academic year 2025-26
Principal, Professor, Associate and Assistant Professors (MBA Department)
Salary, Qualification and Experience as per AICTE and JNTUH Norms
Eligible candidates willing to join can submit their application along with copies of certificates and photographs on or before 20-05-2025 by email or post.
Only shortlisted candidates will be called for interview
Mobile: 7702055677,9676602480
www.ibssolipet.com, Email:ibssolipet@gmail.com

తుంగతుర్తి కాంగ్రెస్‌లో వర్గపోరు

- మోత్కూరు, అడ్డగూడూరు మండలాల సమావేశంలో రసాభాస

సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డిని ఎమ్మెల్యే సామేల్ వైఖరిపై ప్రశ్నిస్తున్న సీనియర్ నాయకుడు నారగోని అంజయ్య

మోత్కూరు, మే 16 : తుంగతుర్తి కాంగ్రెస్‌లో వర్గపోరు చల్లారడం లేదు. పార్టీ కేడర్ మధ్య అంతర్గత కుమ్ములాటలు మరోసారి బహిర్గతమయ్యాయి. మండలంలోని పాటిమట్ల క్రాస్‌రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం పార్టీ క్రియాశీలక కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, పరిశీలకుడు పులి అనిల్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 2017కు ముందు కాంగ్రెస్‌లో పని చేసిన కార్యకర్తలకు మాత్రమే సంస్థాగత ఎన్నికల్లో అవకాశం ఉంటుందని పరిశీలకులు చెప్పారు. దీంతో తమకు అవకాశం దొరకట్లేదని ఎమ్మెల్యే మందుల సామేల్ వర్గానికి చెందిన ఇటి సర్పంచ్ నారగోని అంజయ్యపై కుర్చీలు పైకి ఎత్తి దాడికి దిగారు. అంజయ్యపై చిరంజీవి చేయి చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. అనంతరం డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, పరిశీలకుడు అనిల్‌కుమార్ జోక్యం చేసుకొని వారించడంతో ఘర్షణ సద్దుమణిగింది. పార్టీలో, పాలనలో ఎమ్మెల్యే సామేల్ తన వైఖరిని మార్చుకొని కార్యకర్తలను కలుపుకొని పోకపోతే, అరాచకాలను ఆపకపోతే నిరసన తప్పదని హెచ్చరించారు. కాల చిరంజీవితోపాటు మరికొందరు ఆందోళన చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే అసమ్మతి వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు, లక్ష్మీదేవికాల్వ మాజీ

సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలి

- ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్
- సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా

ధర్నాలో మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్

భువనగిరి కలెక్టరేట్, మే 16 : దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో రిజర్వేషన్లు కేటాయించాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్ డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాల్లో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ, ఆర్‌టీసీ, మండల పరిషత్ పరిధిలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో రిజర్వేషన్ అమలు చేయాలని, యాదగిరిగుట్ట దేవస్థానం పరిధిలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లలో దివ్యాంగులకు షాపులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ జాబ్ కార్డు ఇచ్చి 150రోజులు పని కల్పించాలని, జిల్లా కేంద్రంలో వెయ్యి గజాల స్థలంలో దివ్యాంగుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు సురుపంగ ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్, సామాజికవేత్త బట్టు రామచంద్రయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామి, ఉపాధ్యక్షురాలు పార్వతి, భువనగిరి డివిజన్ ప్రధాన కార్యదర్శి యాదగిరి, మహిళా విభాగం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పద్మ, నాయకులు అంజయ్య, శంకర్, రాయగిరి, యాదగిరి, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, నరేశ్, స్వామి, మంజుల, వెంకటేశం పాల్గొన్నారు.

పల్లెపహాడ్ గ్రామపంచాయతీకి ఎల్ఈడీ లైట్ల అందజేత

ఆత్మకూరు(ఎం), మే 16 : మండలంలోని పల్లెపహాడ్ గ్రామానికి అదే గ్రామానికి చెందిన రెహశ్రీ ఫౌండేషన్ బాధ్యులు కొత్తపల్లి గోవర్ధన్ ఆధ్వర్యంలో శుక్రవారం 50ఎల్ఈడీ వీధి లైట్లను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుబ్బూరి వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి సుజాత, కారోబార్ రఫిక్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చౌటుప్పల్, మే 16 : పట్టణంలో శుక్రవారం రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని ధర్మోజిగూడెం గ్రామానికి చెందిన పిసాటి భూపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి శుక్రవారం బైక్‌పై పంతంగి గ్రామంలోని బంధువు అంత్యక్రియలకు వెళ్లారు. తిరిగి వస్తుండగా.. డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ మన్మథకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోమేశ్వర రైతు సంఘం అధ్యక్షుడిగా రమేశ్‌గౌడ్

ఆలేరు రూరల్, మే 16 : మండలంలోని కొలనుపాక సోమేశ్వర రైతు సంఘం కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బైరి రమేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా సామల మాధవరెడ్డి, కొల్లూరి రాజయ్య, బెల్లంకొండ వేణు, ప్రధాన కార్యదర్శిగా చిర్రబోయిన మల్లేశ్, కోశాధికారిగా గాదె సోమిరెడ్డి, కార్యదర్శులుగా గడ్డమీది రాజుగౌడ్, బెదరబోయిన సంపత్, నంద మహేందర్, మరి కొంత మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఫ్రెండ్స్ యూత్‌క్లబ్ ఆత్మీయ సమ్మేళనం

ఆత్మకూరు(ఎం), మే 16 : మండలంలోని పల్లెర్ల గ్రామంలో ఫ్రెండ్స్ యూత్‌క్లబ్ ఏర్పడి 25సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం యూత్‌క్లబ్ సభ్యులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం యూత్‌క్లబ్ సభ్యులందరం గ్రామానికి ఆదర్శంగా నిలువాలన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ నరేందర్‌గుప్తా, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లారెడ్డి, ఫ్రెండ్స్ యూత్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకన్న, శేఖర్, సభ్యులు సైదులు, చర్యశ్రీ, దేవేందర్, దయాకర్ పాల్గొన్నారు.

పెద్దకందుకూర్‌లో వైద్య శిబిరం

యాదగిరిగుట్ట, మే 16 : ప్రపంచ డెంగ్యూ డే సందర్భంగా మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 26మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఏ ఒక్కరికీ వైరల్, డెంగ్యూ సంబంధిత రోగాలు నిర్ధారణ కాలేదని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ విలియం కేరీ, డాక్టర్ హరీశ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జ్వరాలు సంక్రమిస్తే తీసుకునే చర్యలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సీహెచ్ వెంకటయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిస్టు నాయకుడు బుచ్చిరెడ్డికి నివాళి

బుచ్చిరెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ సత్యం

చౌటుప్పల్ రూరల్, మే 16 : మండలంలోని పంతంగి గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు చిట్యాల బుచ్చిరెడ్డి గురువారం మృతిచెందారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం శుక్రవారం బుచ్చిరెడ్డి ఇంటికి వెళ్లి ఆయన పార్థివదేహంపై పూలమాల ఉంచి నివాళి అర్పించారు. బుచ్చిరెడ్డి కుంటుంబానికి సానుభూతి తెలిపారు. కమ్యూనిస్టు నాయకులు మృతిచెందినా.. వాళ్లు ప్రజల కోసం చేసిన పోరాటాలు మరువలేనివని పేర్కొన్నారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలి : ఎంపీడీఓ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాములునాయక్

ఆత్మకూరు(ఎం), మే 16 : జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ రోజూ ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎంపీడీఓ రాములునాయక్ అన్నారు. ఈజీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలకు రోజూ కొలతల ప్రకారం పనులు చేయించి డబ్బులను సకాలంలో అందించాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం పూటనే పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ రమేశ్, సూపరింటెండెంట్ లోకేశ్వర్‌రెడ్డి, ఈసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో చిన్నారులకు కంటి పరీక్షలు

అంగన్‌వాడీ చిన్నారులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

భువనగిరి అర్బన్, మే 16 : పట్టణంలోని హుస్సేనాబాద్ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు శుక్రవారం ఆర్‌బీఎస్‌కే వైద్యులు కంటి పరీక్షలు చేసి సమస్యలున్న వారిని గుర్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ పాండు మాట్లాడుతూ చిన్నారులకు కంటి పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు, కండ్లద్దాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే దవాఖాన ఫార్మసీ ఆఫీసర్ నిర్మల, ఏఎన్‌ఎం అమల, సీడీపీఓ శైలజ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లలు పాల్గొన్నారు.

క్రీడల్లో జిల్లాను ముందంజలో ఉంచాలి : కిరణ్‌కుమార్

క్రికెట్ కిట్టు అందజేస్తున్న బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కిరణ్‌కుమార్

భువనగిరి అర్బన్, మే 16 : క్రీడల్లో జిల్లాను ముందంజలో ఉంచాలని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉచిత క్రికెట్ కోచింగ్ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న క్రీడాకారులకు శుక్రవారం క్రికెట్ కిట్టు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉచిత సమ్మర్ క్యాంపు సెక్రటరీ అమీన్‌బాబా, కోచింగ్ ఇన్‌చార్జీలు ఆబోతుల కేతన్, సతీశ్, వినోద్ పాల్గొన్నారు.

గాలి వాన భీభత్సం

మోత్కూరు, మే 16 : జిల్లాలో గురువారం రాత్రి గాలి వాన భీభత్సంతో తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లాలోని మోత్కూరు, గుండాల, ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు, మోటకొండూరు మండలాల్లో ఈదురు గాలులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు నేలకొరిగాయి. చేతికందివచ్చిన మామిడి పంట నేలపాలైంది. పాత ఇండ్లు నేలమట్టమయ్యాయి. ఇండ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి.

మోత్కూరు : కొండగడపలో కూలిన విద్యుత్ స్తంభం

మోత్కూరు మండలంలోని కొండగడప, పాటిమట్ల గ్రామాల్లో గాలి వానకు 11కేవీ విద్యుత్ స్తంభాలు 8, ఎల్‌టీ లైన్ స్తంభాలు 13 కూలి కింద పడినట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గుండాల మండలంలో 44.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మోత్కూరు మండలంలో 22.8 ఎం.ఎం., బొమ్మలరామారంలో 32.3, యాదగిరిగుట్టలో 22.8, మిగతా మండలాల్లో మోస్తరు వర్షం పడినట్లు అధికారులు తెలిపారు. గాలి వాన వల్ల పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు తడిసిపోయాయి. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గుండాల : మండల వ్యాప్తంగా గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం భీభత్సం సృష్టించింది. గాలులకు రోడ్లకు ఇరువైపులా చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

గుండాల : తుర్కలశాపురంలో లేచిపోయిన ఇంటి పైకప్పు రేకులు

తుర్కలషాపురం గ్రామానికి చెందిన శీలం లింగస్వామికి ఇంటి పైకప్పు లేచిపోయింది. రామారం గ్రామంలో రైతు మలిపెద్ది బక్కారెడ్డికి చెందిన రెండు గేదెలు పిడుగుపాటుకు గురై మృతిచెందాయి. రోడ్డుపై పడిపోయిన చెట్లను, స్తంభాలను అధికారులు శుక్రవారం తొలగించారు.

పిడుగు పడి 13గొర్రెలు మృతి

అడ్డగూడూరు : మండలంలోని డి.రేపాక గ్రామంలో పిడుగుపడి 13 గొర్రెలు మృతిచెందాయి. ఆర్ఐ రాజేశ్ శుక్రవారం గ్రామానికి వెళ్లి మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు. సుమారు రూ.1.30లక్షలు నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. వర్షంతో మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. కంచనపల్లిలో తడిసిన ధాన్యం బస్తాలను తాసీల్దార్ శేషగిరిరావు పరిశీలించారు. సుమారు 200 బస్తాలు తడవడంతో మిల్లు యాజమాన్యంతో మాట్లాడి దిగుమతి చేయించినట్లు తెలిపారు. ఆయన వెంట సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, ఏఓ పాండురంగాచారి ఉన్నారు.

జానకిపురంలో సుజాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

మోహన్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే కిశోర్ పరామర్శ

అడ్డగూడూరు, మే 16 : మండలంలోని జానకిపురం గ్రామ మాజీ సర్పంచ్ కొప్పుల మోహన్‌రెడ్డి సతీమణి సుజాత (65) అనారోగ్యంతో ఇటీవల మరణించింది. మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ శుక్రవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుజాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చౌళ్లరామారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువజన నాయకుడు తోట నవీన్ తండ్రి కిష్టయ్య(70) చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకన్న, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రవీణ్‌కుమార్ కుటుంబానికి అండగా నిలుస్తాం

- డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

ప్రవీణ్‌కుమార్ అంతిమయాత్రలో పాల్గొన్న గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, మే 16 : బీఆర్ఎస్ కార్యకర్త సదా ప్రవీణ్‌కుమార్ ముదిరాజ్ అకాల మృతి మనసును కలిచివేసిందని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గౌరాయిపల్లి గ్రామంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రవీణ్ మృతిచెందగా.. శుక్రవారం నిర్వహించిన అంతిమయాత్రలో మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. దహన సంస్కారాలు పూర్తయ్యే వరకు అక్కడే ఉండి ప్రవీణ్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న కార్యకర్తకు అండగా నిలుస్తామన్నారు. మృతుడి సభ్యత్వాన్ని పరిశీలించి బీఆర్ఎస్ పార్టీ నుంచి ప్రమాద బీమాను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, నాయకులు దండెబోయిన అనిల్, పాపట్ల నరహరి, ఆవుల సాయి పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత

ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్, మే 16 : మండలంలోని నెమరుగోముల గ్రామానికి చెందిన మెట్టు బాలకృష్ణారెడ్డి కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. ఆయన వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.3,75,000 ఎల్ఓసీ మంజూరైంది. ఆ పత్రాన్ని బాధితుడి కుటుంబ సభ్యులకు శుక్రవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కు